క్లుప్తంగా

పని ప్రదేశంలో 'ఉపాధి' కూలీ మృతి



సుధాకర్(ఫైల్)

లింగాలఘణపురం: వనపర్తికి చెందిన ఉపాధి హామీ కూలీ ఎర్ర సుధాకర్ (53) గురువారం ఉపాధి హామీ పనులు చేస్తూ గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. సుధాకర్ రోజు వారిగా కూలీలతో కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. గడ్డపారతో మట్టి తవ్వుతుండగా ఒక్కసారిగా స్పృహ తప్పి కుప్పకూలి పోయాడు. తోటి కూలీలు వెంటనే లేపి నీళ్ల తాగించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. దీంతో కూలీలంతా ఒక్కసారిగా బోరుమన్నారు. కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

'అనర్హులకే ఇందిరమ్మ ఇళ్లు'



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: అనర్హులకే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారని ఆరోపిస్తూ బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ సుమన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ మాట్లాడుతూ అర్హులను కాదని ఎమ్మెల్యే అనుచరులు, నాయకులు చెప్పిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయడంతో పేదలు ఆందోళన చెందుతున్నార న్నారు. ఇప్పటికైనా అర్హులను గుర్తించి ఇళ్లు ఇవ్వాలని కోరారు. మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహ్మద్ వలిపాష, నాయకులు రామరాజుగౌడ్, సారయ్య, రమేష్, రవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

'శ్రమించిన కాంగ్రెస్ శ్రేణులను విస్మరించొద్దు'

దేవరుప్పుల: అసెంబ్లీ ఎన్నికల నాటికి శ్రమించిన కాంగ్రెస్ శ్రేణులను విస్మరించడం తగదని కాంగ్రెస్ మండల నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి విమర్శించారు. గురువారం కాంగ్రెస్ సన్నాహక సమావేశానికి వెళ్తే అరెస్టు చేయబడిన ఉప్పల ప్రకాశ్, తోటకూరి రమేశ్‌ను విడిపించుకుని పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. పార్టీ బలోపేతం పేరిట కాంగ్రెస్‌ను అనేక విధాలుగా అణిచివేసిన గులాబీలను అక్కున చేర్చుకుని అసలు కాంగ్రెస్ వాదులను కనుమరుగుచేసే చర్యలను నిఖార్సయిన కాంగ్రెస్ శ్రేణులు ఖండించాలని కోరారు. 2017 నుంచి ఎవరైతే కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారో వారినే ఎన్నుకోవాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు తెలియజేయాలని సమావేశ హాల్‌కు వెళ్తే పోలీసుల ముందస్తు అరెస్టు ప్రక్రియ అప్రజాస్వామికమన్నారు. ఆయన వెంట కొడగాని సోమనర్సోజీ, గొడిశాల శ్రీనివాస్, పాము యాకస్వామి, చారీ, మహేం దర్‌జీ, కడారి అంజయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీ ఈటలపై అనుచిత వ్యాఖ్యలు తగవు'

పాలకుర్తి: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జగ్గారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు, కల్నల్ డాక్టర్ భిక్షపతి అన్నారు. గురువారం ఆయన పాలకుర్తిలో మాట్లాడారు. ఈటలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

గాలివాన బీభత్సం



రోడ్డుపై పడిన చెట్టును పొక్లెయినర్‌తో తొలగిస్తున్న పోలీసులు

పాలకుర్తి టౌన్: మండలంలో గురువారం రాత్రి కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులకు మండలంలో చెట్లు విరిగి పడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మహిళా సంఘాల, పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. కాగా, పాలకుర్తి నుంచి బమ్మెర రోడ్డుపై చెట్టు విరిగి పడటంతో ఎస్సైలు పవన్‌కుమార్, లింగారెడ్డి, పోలీసు సిబ్బంది పొక్లెయినర్‌తో తొలగించారు.

ఆర్థికసాయం

చిల్పూరు: పల్లగుట్ట గ్రామానికి చెందిన ఐలపాక జాన్ రాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు గురువారం 50 కేజీల బియ్యం, రూ. 5వేల నగదును పంపగా నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. దార రాజు, ఏసు, కృష్ణ, అశోక్‌పాల్, రజని, అశోక్, ఉపేందర్, ఏసోబు పాల్గొన్నారు.

అసంపూర్తిగా వంతెనలు

- మారుమూల పల్లెలకు దూర భారం
- ఎంఆర్ఆర్ కింద రూ.21.80 కోట్లతో బ్రిడ్జి పనులు
- చిన్నవాగుపై నిర్మాణానికి రూ. 3.50 కోట్లు మంజూరు



రంబోజీగూడెం వాగుపై కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు, (ఇన్‌సెట్‌లో) పెద్దమడూరులో వంతెన నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

దేవరుప్పుల: మండలంలోని కోలుకొండ–గొల్లపల్లి వాగు పరివాహక ప్రాంతాల్లోని మడూరు వాగులపై వంతెనలు అసంపూర్తిగా ఉన్నాయి. అవి పూర్తయితేనే కుగ్రామాలకు బహుళ ప్రయోజనం చేకూరనుంది. మండలంలోని చిన్నమడూరు, పెద్ద మడూరు వాగుకు పడమర ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో వ్యవసాయ పనులు తూర్పు ప్రాంతంలో ఉన్నాయి. వీటితోపాటు ఈ రెండు రెవెన్యూ గ్రామాల కింద రంబోజీగూడెం, రాజీవ్‌నగర్, నల్లకుంటతండా ఆవాస గిరిజన, ఇతరయేతర సామాజిక వర్గాల పల్లెలు ఉన్నాయి. ఈ మేజర్ గ్రామాలతో పల్లె ప్రజలకు నిత్యం అవసరాలకు రాకపోకలు జరుగాల్సి ఉంటుంది. ప్రాథమిక విద్య పూర్తిచేసిన పల్లె విద్యార్థులు, రైతులు అనేక ఎళ్ల నుంచి చాలా పాట్లు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాగులపై రెండు వంతెనల అత్యంత ఆవశ్యకతపై ప్రజల డిమాండ్ మేరకు అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పందించి మెయింటెన్స్ ఆఫ్ రూరల్ రోడ్డు(ఎంఆర్ఆర్) పనులు కింద మంజూరు చేయించారు. ఈ రెండు వంతెన పనులకు 2023 జూన్ 11వ తేదీన శంకుస్థాపన చేశారు.

రంబోజీగూడెంలో కొనసాగుతున్న వంతెన పనులు

చిన్నమడూరు–రంబోజీగూడెం మధ్య వాగుపై రూ.10.80 కోట్ల నిధులు మంజూరు కాగా ఆగమేఘాల మీద గత ప్రభుత్వం శిలాఫలకం వేసింది. అసెంబ్లీ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలోనే హన్మకొండకు చెందిన జెఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ టెండర్ దక్కించుకుంది. నిధుల లేమితో పనులు ప్రారంభించని దిశలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రస్తుత ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి చొరవతో ఎట్టకేలకు ఇక్కడ వంతెన పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. కానీ చిన్నవాగుపై మరో మినీ వంతెన కడితే తప్ప ఈ వంతెన కట్టి ప్రయోజనం లేకపోయింది. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలు గత జనవరిలో ఎంఆర్ఆర్ కింద రూ. 3.50 కోట్లు మంజూరు చేయించడంతో జటిల సమస్యకు మోక్షం లభించినట్టయింది.

వంతెనలు పూర్తయితే తగ్గనున్న దూర భారం

నిర్దేశిత లక్ష్యంతో సకాలంలో పనులు పూర్తయితే ఈ రెండు వంతెనలు పూర్తయితే పెద్ద, చిన్నమడూరు రెవెన్యూ గ్రామాలతోపాటు మాధాపురం, కడవెండి తదితర గ్రామాలకు జిల్లా కేంద్రం వెళ్లేందుకు దూర భారం తగ్గనుంది.

శిలాఫలకానికే పరిమితమైన పెద్దమడూరు వంతెన పనులు

పెద్దమడూరు–కడవెండి (నల్లకుంట తండా) మధ్య ఉన్న వాగులో గతంలో చెక్‌డ్యామ్ కట్టేటప్పుడు ముందు చూపులేకపోవడంతో ఇరు గ్రామాల మధ్య ఇబ్బందికర పరిస్థితులు ఎదురర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారానికి ఎట్టకేలకు ఎంఆర్ఆర్ కింద రూ.11 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. కానీ పాత బాట స్థలంలో చెక్‌డ్యామ్ రావడంతో కొత్త వంతెన కోసం భూసేకరణ సమస్య వచ్చింది. దీంతో వంతెన పనులకు ఎడాదిన్నరగా మోక్షం కలుగలేదు. ఇటీవలనే భూనిర్వాసితులకు పరిహారం ఇచ్చే అంగీకారం కుదిరినట్టు సమాచారం.

వంతెనతో పల్లెలు అభివృద్ధి చెందుతాయి



రంబోజీగూడెం వాగుపై వంతెన పనులు పూర్తయితే పల్లెలు అభివృదద్ధి చెందుతాయి. ఇక్కడి విద్యార్థులకు దూర ప్రాంతాలకు వెళ్లే బాధ తప్పుతుంది. అంతేగాక జిల్లాకు దూరం తగ్గుతుంది. గత ప్రభుత్వం మంజూరుకే పరిమితమైతే కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేపిస్తోంది.

– పరీధుల భాస్కర్, మాజీ ఉపసర్పంచ్, రంబోజీగూడెం

శిలాఫలకానికే పరిమితం



మా ఊరుకు సంబంధించి సగానికి పైగా రైతులు, గీత కార్మికులం వాగు అవుతల తూర్పు దిక్కు వ్యవసాయం, తాటిచెట్లపై ఆధారపడి బతుకుతున్నాం. కానీ వర్షాకాలం వస్తే అరచేతిలో ప్రాణం పెట్టుకుని వాగు దాటి పోవాల్సి వస్తోంది. రెండేళ్లు దాటిన వంతెన పనులు శిలాఫలకానికే పరిమితం అయ్యాయి. ఈ ప్రభుత్వమైనా వంతెన పనులు పూర్తిచేయాలి.

– ముత్యాల నరేష్, రైతు, పెద్దమడూరు

ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కుమారస్వామి

కొడకండ్ల: ఉద్యమకారుల ఆకాంక్షలను ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర చైర్మన్ గోదుమల కుమారస్వామి డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద ఈ నెల 25వ తేదీన తలపెట్టిన చలో పాలకుర్తి పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలు ఆకాంక్షలతో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుల ఆకాంక్షలు అడియాసలయ్యాయని అన్నారు. ప్రభాకర్, యాకన్న, నసీరుద్దీన్, మదుసూధన్, శ్రీనునాయక్, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన సీపీఐ నిరంతర పోరాటం



జెండావిష్కరిస్తున్న నాయకులు

జనగామ రూరల్: ప్రజల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి చల్లోజు మల్లేశం పేర్కొన్నారు. గురువారం వడ్లకొండ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శిగా జూకంటి నర్సింహులు, సహాయ కార్యదర్శిగా రెడ్డబోయిన వెంకటయ్య ఎన్నికయ్యారు. నాయకులు జూకంటి మల్లయ్య, పర్వతాలు, గట్టుమల్లు, రవి, వీరయ్య, గీత, నాగమ్మ, రాజమ్మ, హేమ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజారెడ్డి తదితరులు

జనగామ రూరల్: ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఏఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఐఏటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నల్ల నర్సింహులు స్మారక భవనంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చామకూర యాకుబ్, సొప్పరి సోమయ్య, మల్లేశం, మోటి శ్రీశైలం, రాజు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిబంధనలు విస్మరిస్తే వేటు అనివార్యం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి,పక్కన ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల : కాంగ్రెస్ పార్టీ నిబంధనలు విస్మరిస్తే వేటు అనివార్యమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థాగత సన్నాహక సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అధ్యక్షత వహించగా వారు మాట్లాడారు. అసంతృప్తులు ఆత్మవిమర్శ చేసుకుని పార్టీలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కోవర్టు రాజకీయాలకు పాల్పడే వారు ఉంటే బుద్ధి మార్చుకోవాలన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు తార, డెయిరీ జిల్లా చైర్మన్ ధర్మారెడ్డి, సీనియర్ నాయకులు ఉప్పల సురేష్‌బాబు, రసూల్, రామచంద్రునాయక్, నల్ల సత్యనారాయణ, పాండు, గణేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రేణుకా ఎల్లమ్మ, దుర్గామాత ఉత్సవాలు



రఘునాథపల్లి: బోనాలతో వెళ్తున్న మహిళలు



తాటికొండలో..

రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన రేణుక ఎల్లమ్మ, దుర్గామాత ఉత్సవాలు గురువారం ముగిశాయి. బుధవారం అర్ధరాత్రి ఊరుమ్మడిగా డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో దుర్గామాత ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించారు. గురువారం డుబ్బులోళ్ల ఆలయం వద్ద గావు పట్టడంతో గ్రామస్తులు కోళ్లు, యాటలు బలిచ్చారు. మధ్యాహ్నం దుర్గామాతకు మహిళలు ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్, మాజీ ఎంపీటీసీ అల్లిబిల్లి కృష్ణ, జిట్టె వీరస్వామి, బాల్నె రాజయ్య, బండ మీది వెంకన్న, సురుగు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారి బోనాలు

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో కనకదుర్గ అమ్మవారి దేవాలయ మూడో వార్షికోత్సవం వేడుకల సందర్భంగా తిరుగువారం పండుగను పురష్కరించుకుని గురువారం ఘనంగా బోనాలపండుగను చేపట్టారు. మహిళలు సామూహికంగా డప్పుచప్పుళ్లతో దేవాలయానికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్వాహకులు పండుగ రాజేశ్వర్, పండుగ బుచ్చయ్య, నారబోయిన కుటుంబీకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా మార్చేందుకే 'ఉల్లాస్'



ఉల్లాస్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

తరిగొప్పుల: 15 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడానికి ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మండల విద్యాధికారి నెల్లుట్ల జానకి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఉల్లాస్ కార్యక్రమంపై మహిళా సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐకేపీ సీసీలు, ఫీల్డ్‌అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోని నిరక్షరాస్యుల వివరాలను సర్వేలో సేకరించాలని సూచించారు. ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఏపీఎం విజయ, కాంప్లెక్స్ హెచ్‌ఎం రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ, సీఆర్పీ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ నర్సయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను గురువారం ఏర్పాటు చేయగా ప్రిన్సిపాల్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఘన్‌పూర్‌లో దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడమైందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 99080–77894నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. అధ్యాపకులు జగదీష్‌బాబు, దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ నిర్వాహకులు జి.గోవర్ధని, బి.సునీత, డి.సరోజ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఒకేషనల్‌లో ప్రవేశాలకు..

నర్మెట: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అప్‌గ్రేడ్‌లో భాగంగా ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును 2025–26 విద్యాసంవత్సరానికి ప్రారంభిస్తున్నట్లు ఎస్‌ఓ బైరోజు రజిత గురువారం తెలిపారు. పరిమితంగా 40 సీట్లు మాత్రమే ఉన్నందున పదో తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తి గల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తివివరాలకు 99494 12546ను సంప్రదించాలని తెలిపారు.

'స్థానికం'లో గులాబీ జెండా ఎగరడం ఖాయం



మాట్లాడుతున్న దయాకర్‌రావు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పాలకుర్తి గడ్డపై గులాబీ జెండా ఎగురడం ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా దయాకర్‌రావు పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలు అరిగోస పడుతున్నారని, వరి ధాన్యం కొనగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిదన్నారు. మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, సొసైటీ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర

కొడకండ్ల: మండలకేంద్రంలో హనుమాన్ శోభాయాత్ర గురువారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మాలధారణ స్వాములతో పాటు భక్తులంతా అంజనేయస్వామి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. భజనలు పాటలతో మండలకేంద్రంలోని ప్రధాన రోడ్డులో శోభాయాత్రను నిర్వహించగా హనుమ నామ స్మరణతో మండలకేంద్రం మారుమోగింది. హనుమాన్ మాలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

బచ్చన్నపేట: గ్రామాల్లోని ఆలయాల్లో హనుమాన్ స్వాములు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసిరెడ్డిపల్లిలో జక్కుల మౌనిక–అశోక్ దంపతులు మాలధారులకు అన్నదానం చేశారు.

గుమస్తాల సంఘం కమిటీ ఎన్నిక



గుమస్తాల సంఘం నూతన కార్యవర్గం

జనగామ రూరల్: జిల్లా కోర్టు న్యాయవాదుల గుమస్తాలా సంఘం నూతన కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఎండీ.ఖాజాపాషా అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా బైరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వల్లూరి నరేష్, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల మల్లేశ్, సహాయ కార్యదర్శిగా షాడ శ్రావణ్, కోశాధికారిగా మారబోయిన ఉపేందర్, అర్గనైజర్‌గా బత్తుల రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా తోకల రమేశ్, గూడపు అశోక్, రాపాక ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులుగా రఘు, ఎదునూరి పోచయ్య ఎన్నికయ్యారు.

ఓపెన్ ప్లాట్లలో మంటలు



ఎగిసిపడుతున్న మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

జనగామ: పట్టణంలోని కురుమవాడ ఏరియా వినాయకనగర్ ఓపెన్ ప్లాట్లలో గురువారం చెత్తకు నిప్పు అంటుకుని మంటలు ఎగిసి పడ్డాయి. ప్లాట్స్‌లోని చెట్లు నరికి చెత్తను అక్కడే వదిలి వెళ్లడంతో నిప్పు అంటుకుని మంటలు వ్యాపించడంతో కాలనీ వాసులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అగ్నిమాపక శాఖను అప్రమత్తం చేయడంతో సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో చేరుకున్నారు. గంట పాటు కష్టపడి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు.

మాదిగలంతా ఏకం కావాలి



మాట్లాడుతున్న దయాకర్

లింగాలఘణపురం: మాదిగలంతా రాజకీయాలకు అతీతంగా ఏకమై గ్రామాలను దండోరా ఉద్యమ కేంద్రాలుగా మలిచి జాతి అస్తిత్వాన్ని కాపాడుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకుల సమావేశం బొట్ల మహేశ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా దయాకర్ పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాగల్ల ఉపేందర్, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, నర్సింగ రవి, ఉపేందర్, శాంతి, నవీన్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడిగా నర్సింగ రవి

ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడిగా నర్సింగ రవిని నియమించినట్లు పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ రవి మాట్లాడుతూ మండల అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మలుపు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు



మలుపు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

బచ్చన్నపేట: మండల కేంద్రం నుంచి ఆలేరు పట్టణానికి వెళ్లే దారిలో గోపాల్‌నగర్ గ్రామం దాటిన తర్వాత పదిమోటల బావి వద్ద మలుపు వద్ద ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. సాక్షిలో 'వారానికో ప్రమాదం' అనే శీర్షికన ఇటీవల ప్రచురితమైన కథనానికి ఆయన గురువారం స్పందించి బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న మలుపును డీసీపీ రాజమహేంద్రనాయక్, నర్మెట సీఐ అబ్బయ్యలు పరిశీలించి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని సూచించినట్లు తెలిపారు. కానిస్టేబుళ్ల రాకేష్, అనిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'ఆరోపణలు సరికాదు'



యాదగిరికి మద్దతు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

తరిగొప్పుల: మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి అహర్నిశలు కృషిచేశారని, బీఆర్ఎస్ పార్టీకి కోవర్టులుగా మారిన కొందరు వారి ఆటలు సాగడంలేదనే అక్కసుతోనే ఆయనపై అసత్య ఆరోపణలు చేస్తుండటం సరికాదని జిల్లా కార్యదర్శి బృంగి శివకుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్రవెల్లి పోషయ్య అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ ఒక్క కార్యకర్తను కలుపుకుపోతు ముందుకు సాగుతున్న ఆయనపై అసత్యప్రచారం చేయడం తగదన్నారు. మండల అధ్యక్షుడిగా యాదగిరి గౌడ్‌కే తమ మద్దతు ప్రకటిస్తూ ఏకపక్షంగా తీర్మానం చేస్తున్నట్లు తెలిపారు. పింగిళి ఇంద్రారెడ్డి, మేర్గొజు నరహరి, యూత్ అధ్యక్షుడు అర్జుల అరుణ్‌రెడ్డి, బైకాని బాలరాజు, కత్తుల సాయిరెడ్డి, పులి బాలయ్య, ప్రకాశం తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జనగామ :
9951602871
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)